## సాగునీరందిస్తాం... అధైర్యపడొద్దు



నదిలో పనులు చేస్తున్న దృశ్యం

అలంపూర్, అక్టోబర్ 31 : నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఆర్డీఎస్ ద్వారా సాగునీరందించేందుకు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తుంగభద్రానదిలో పాయ తీసే పనులు ప్రారంభించారు. తుమ్మిళ్ళ ఎత్తిపోతల నుంచి నీటి సరఫరాకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. కాగా ఈ పనులు పూర్తయితే నదీ నుంచి తుమ్మిళ్ల ఎత్తిపోతల వరకు నీరు చేరుతుంది. అక్కడినుంచి ఎత్తిపోతల ద్వారా ఆర్డీఎస్ కాల్వల నుంచి దిగువ ప్రాంతానికి చేరుతాయి. రైతులు దిగాలు చెందాల్సిన పని లేదని రెండు మూడు రోజుల్లో పంట పొలాలకు నీరందుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రకాశ్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## మూగజీవాలకు టీకాలు

అయిజ రూరల్, అక్టోబర్ 31 : ప్రభుత్వం ముందస్తుగా మూగజీవాలను దృష్టిలో ఉంచుకొని పారుడు రోగ నివారణ టీకాలను వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మండల పరిధిలోని యాపదిన్నె, కుర్వపల్లి గ్రామాల్లో మంగళవారం మండల పశువైద్యాధికారిణి స్వరూపారాణి ఆధ్వర్యంలో జీవాలకు పారుడురోగ నివారణ టీకాలను వేశారు. ఆయా గ్రామాల గొర్రెల కాపరులు తమజీవాలకు టీకాలు తప్పక వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సుధాకర్, మధు పాల్గొన్నారు.

## ఆస్తిపన్నులు సకాలంలో చెల్లించాలి

అయిజ, అక్టోబర్ 31 : పట్టణ ప్రజలు ఆస్తి పన్నులు సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ సూచించారు. మంగళవారం పట్టణంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల, శివసాయి డిగ్రీ కళాశాల యాజమాన్యాల నుంచి ఆస్తిపన్నులు వసూలు చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరం ఫెనాల్టీ లేకుండా చెల్లింపు గడువు ముగియడంతో ప్రతినెలా 2 శాతం రుసుం విధిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. పట్టణంలో రూ.1.60 కోట్ల ఆస్తిపన్ను వసూలు కావల్సి ఉందని, ఇప్పటివరకు రూ.69లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఆస్తిపన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ గోపాల్, మేనేజర్ రాజేశ్‌కుమార్, బిల్ కలెక్టర్లు మహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాలను దర్శించుకున్న మేడ్చల్ కలెక్టర్



ఆలయంలో కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

అలంపూర్, అక్టోబర్ 31 : మంగళవారం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ దర్శించుకున్నారు. వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో మహా మంగళహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి వెంట తాసీల్దార్ మంజుల ఉన్నారు.

## మద్యం పట్టివేత - కేసు నమోదు



పట్టబడిన మద్యం బాటిళ్లు

అలంపూర్, అక్టోబర్ 31 : అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై రమేశ్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని లింగనవాయి గ్రామంలో బెల్ట్ షాపులపై దాడులు చేశారు. గ్రామంలో బీసన్న కిరాణ దుకాణంలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన మద్యాన్ని గుర్తించి పట్టుకున్నారు. ఈ మేరకు మద్యం స్వాధీనం చేసుకుని దుకాణ యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# 290 పోలింగ్ కేంద్రాలు .. 31 రూట్లు

- అలంపూర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న అధికారులు
- అన్ని రూట్లకు అధికారుల నియామకం
- పోలింగ్ కేంద్రాల తనిఖీ ముమ్మరం



రాజాపురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారి, ఎంపీడీవో సాయిప్రకాశ్ (ఫైల్)

అయిజ, అక్టోబర్ 31 : నియోజకవర్గంలోని 2,36,076 మంది ఓటర్లకు 290 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. నియోజకవర్గంలోని 7 మండలాలను 31 రూట్లుగా విభజించి సెక్టోరియల్ అధికారులను జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి నియమించారు. ఓటర్లు ఓటుహక్కును సజావుగా నిర్వహించేందుకు వీలుగా 290 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా రూట్లకు కేటాయించిన సెక్టోరియల్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించి, పోలింగ్ అవసరమైన ఏర్పాట్లపై ఆరా తీస్తున్నారు. ప్రతిపోలింగ్ కేంద్రంలో విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం, దివ్యాంగులు ఓటు వేసేందుకు అనువుగా ర్యాంపుల ఏర్పాటు, భద్రత చర్యలు, ఈవీఎంల భద్రత వంటి అంశాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నారు. పోలింగ్ నాటికి ప్రతి కేంద్రంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సౌకర్యాలను కల్పించేందుకు స్థానిక రెవెన్యూ, పంచాయతీశాఖలు చర్యలు తీసుకుంటున్నాయి. నియోజకవర్గంలోని 290 పోలింగ్ కేంద్రాలను ఒక్కో సెక్టోరియల్ అధికారికి 8 నుంచి 10 పోలింగ్ కేంద్రాలను కేటాయించి సౌకర్యాలపై పరిశీలించాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. నియోజకవర్గంలోని 31 మంది రూట్ అధికారులు పోలింగ్ కేంద్రాలను స్థానిక పోలీసుల సహకారంతో పరిశీలన నియోజకవర్గంలోని పలు రూట్లలో సెక్టోరియల్ అధికారులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకునేందుకు పోలీస్‌శాఖ మార్గాలను అన్వేషిస్తోంది.

# ఆర్డీఎస్ ఆయకట్టు నీటి విడుదలకు సన్నాహాలు !



ఆర్డీస్ కెనాల్

అయిజ, అక్టోబర్ 31 : ఆర్డీఎస్ ఆయకట్టుకు కేటాయించిన నీటిని టీబీ డ్యాం ద్వారా విడుదల చేయించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గత నెలలో ఆర్డీఎస్ నీటి వాటా ఒక టీఎంసీ నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 2.224 టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు అవకాశం ఉంది. 60-40 రేషియో ప్రకారం కర్నూల్ జిల్లాలోని కేసీ కెనాల్, ఆర్డీఎస్ నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. కేసీ కెనాల్ ఇండెంట్‌లోని ఒక టీఎంసీ నీటిని ఎల్ఎల్‌సీ కాల్వ ద్వారా వినియోగించుకున్న కర్నూల్ అధికారులు, ఉన్న 3.096 టీఎంసీల నీటిని ఆర్డీఎస్ ఇండెంట్‌తో పంపితే ఆర్డీఎస్ ఆయకట్టుతో పాటు తుమ్మిళ్ల, కేసీ కెనాల్ ఆయకట్టుకు ఉపయోగకరంగా ఉంటుందని ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతానికి ఆర్డీఎస్ నీటి వాటా 2.224 టీఎంసీల నీటి విడుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్ఈ, సీఈలతో చర్చించి ఈఎన్‌సీ మురళీధర్‌కు ఇండెంట్ పంపనున్నట్లు చెప్పారు. ఈ నెల 4,5 తేదీల్లో నీటిని విడుదల చేసి నెలాఖరు వరకు ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. కర్ణాటకలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది తుంగభద్ర డ్యాంలోకి 105 టీఎంసీల నీరు చేరింది. చేరిన నీటిని కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు టీబీ బోర్డు ఇంజినీర్లు కేటాయింపులు చేశారు. తెలంగాణ రాష్ట్ర పరిధిలోని ఆర్డీఎస్ ఆయకట్టుకు 3.224 టీఎంసీలు, కర్నూల్ జిల్లాలోని కేసీ కెనాల్‌కు 4.096 టీఎంసీల నీటిని కేటాయించారు.

### నాలుగున్నర అడుగులకు నీటి నిల్వ

కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టలో నీటి నిల్వ నాలుగున్నర అడుగులు చేరుకున్నది. మంగళవారం ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో నిల్ ఉండగా, అవుట్‌ఫ్లో 156 క్యూసెక్కులు నమోదైనట్లు ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు. ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 104 క్యూసెక్కులు చేరుతుండగా, ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 4.5 అడుగుల మేర నీటి మట్టం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

### డ్యాంలో 32.950 టీఎంసీల నిల్వ

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంలో ప్రస్తుతం 32.950 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో నిల్ నమోదు కాగా, అవుట్‌ఫ్లో 9,013 క్యూసెక్కులు ఉంది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 32.950 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1633 అడుగుల గరిష్ట నీటి మట్టానికి, ప్రస్తుతం 1607.52 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు టీబీ డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

## ఏపీసరి హద్దులోచెక్ పోస్ట్ ఏర్పాటు



చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు

ఉండవెల్లి, అక్టోబర్ 31 : ఎన్నికల కమిషన్, జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ, కర్నూల్ ఎస్పీ అదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దులో తాలూకా సీఐ శ్రీరామ్, ఎస్సై బాలనర్సింహ ఆధ్వర్యంలో చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దు పోలీస్‌స్టేషన్‌లలో నేర ప్రవృత్తి కలిగిన వారి వివరాల, నగదు, మద్యంతో పాటు, ఓటర్లను ప్రభావితం చేస్తే వస్తువుల తరలింపుపై నిఘా ఉంచి కర్నూలు జిల్లా పంచాలింగాల గ్రామ శివారులో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. 24 గంటలపాటు రెండుషిఫ్ట్‌లలో నలుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తూ వాహనదారులకు తెలంగాణ రాష్ట్రంలోని ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పిస్తామని హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత

వడ్డేపల్లి, అక్టోబర్ 31 : శాంతినగర్‌లో మంగళవారం రోజు ఎన్టీఆర్ నగర్ సమీపంలో ఎస్సై నరేశ్ వాహనాలను తనిఖీల్లో భాగంగా కర్నూలు వైపు వెళ్తున్న బొలేరో వాహనాన్ని నిలుపగా దాపిరి రిజిస్ట్రేషన్ నెంబర్‌లేదు, వాహనంలో పీడీఎస్ బియ్యం వున్నాయి. ఈ బియ్యాన్ని రామాపురానికి చెందిన హమీద్‌మియా, పరశురాముడులు అక్రమంగా తరలిస్తున్నారని ఎస్సై తెలిపారు. వాహనంలో 14 క్వింటాళ్ల బియ్యం ఉన్నాయన్నారు. వాహనాన్ని, బియ్యాన్ని స్టేషన్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.



పట్టుకున్న రేషన్ బియ్యంతో పోలీసులు